# కనపడనిగాయం

[కథానిక]

✽

= శ్రీ ఈరంకి వెంకటరావు =

మూర్తికి ఎవళ్ళూ అనుకోకుండా, నలుగురూ రాకుండానే పెళ్ళి అయిపోయింది. అసలు మూర్తే అనుకోలేదు, ఆసంవత్సరంలో, అందులో ఆ నెల్లో పెళ్ళి అవుతుందనిగాని, ఆసంబంధం అవుతుందనిగాని.

"మొత్తానికి ఇన్నాళ్ళూ ఆగి పప్పులో కాలు వేశాడు" అంది లోకం. "వీడి బి. ఏ. తెలివితేటలన్నీ ఏమయిపోయాయి, ఆసంబంధం ఎంచుకోవడంలో" అని ఆగ్రహపడ్డారు అతని సన్నిహితబంధువర్గం. మూర్తి స్నేహితులు అతని పెళ్ళాన్ని చూసి మూతివిరుచుకున్నారు. అతని ఆదర్శాభిప్రాయాలన్నీ అతనే మంటగలిపేశాడన్నారు అతని తలిదండ్రులు. "వాడి ప్రారబ్ధం—అనుభవించాలిసిందే బతికివున్నన్నాళ్ళూ" అన్నారు.

మూర్తిమాత్రం ఇంతమందికి ఇష్టంలేని ఆపిల్లను—అనకూపపిల్లను ఎందుకు చేసుకున్నాడో ఎవరికీ అర్థం గాదు. అసలుమూర్తికే తెలియదేమోగూడా, ఎందుకు ఆపిల్లను పెళ్ళి చేసుకున్నాడో.

మూర్తి పూర్తిపేరు శివరామమూర్తి. అయితే అతన్ని అందరూ మూర్తి అనే పిలవటం వాడుక. పూర్తిపేరు చాలామందికి తెలియదేమోగూడా. మూర్తి మంచి స్ఫురద్రూపి. అతను చురుకైనవాడని చెప్పలేంగాని, విద్యవిషయంలోమాత్రం ఎక్కడా బోల్తా కొట్టకుండా వచ్చి, తనూ ఒక బి. ఏ. ననిపించుకున్నాడు. మూర్తికి ఏమీ లోటురాకుండా అతని దత్తత తండ్రి చాలా జాగ్రత్తగా చూశాడు. కన్నతండ్రి దగ్గరే వుంటే అతనికీపాటి చదువు రాకనూ పోను, ఆయన చెప్పించాలేడు. మొత్తానికి మూర్తికి ఇరవై రెండేళ్ళు వచ్చేదాకా అతని అదృష్టానికేమీ లోటులేకపోయింది. అతను ఆడిందల్లా ఆటగానూ, పాడిందల్లా పాటగానూ సాగింది.

మూర్తికి జరుగకూడని లోటంతా అతని పెళ్ళి విషయంలోనే జరిగింది. అతను యీ సంబంధం చేసుకునేముందు అనేకమంది పెళ్ళికూతుళ్ళను చూశాడు. కొంతమంది అతనికి బాగా నచ్చినా, కొన్ని విషయాలు కుదరక అతను ఎవ్వరికీ మాట ఇవ్వలేకపోయాడు. కొన్ని లోటుపాట్లు ఇతను సర్దుకున్నా వాళ్ళ నాన్న ఒప్పుకోక మరికొన్ని సంబంధాలు తేలిపోయాయి. చివరకు మూర్తి తనకు పెళ్ళి కాదేమోనని భయపడి చేసుకున్నట్లుగా యీ అష్టవంకర సంబంధాన్నే ఎంచుకున్నాడు.

మూర్తికి ఆదర్శాలు లేకపోలేదు. అతను తనకు కాబోయే భార్య ఇలాగ వుండాలి, అలాగ ఉండాలి అని మనోవీథిలో చిత్రించుకోకపోలేదు. ఆమెకోసం అతను విరహవేదన ననుభవించకపోలేదు. చివరకు తనకు కాబోయే భార్య ఫలానా ఫలానా రీతిగా వుండాలని అతను స్నేహితులతోగూడా అప్పుడప్పుడు చెప్తూవుండేవాడు. ఏమయితేనేం, అతని ఆశలన్నీ చివరకు వృథా అయినాయి.

అతనికి యీ పెళ్ళివిషయంలో సహాయపడుతున్నట్లుగా నటించి గోతిలో దింపిన సంధాయకుడు

లేకపోలేదు. అతను మూర్తికి ఒక వేలువిడిచిన మేనమామకొడుకు. పేరు సుబ్బారావు. అసలు రెండేళ్ళ క్రిందట సుబ్బారావుచెల్లెలును మూర్తికి ఇస్తామన్నారు. కాని మూర్తి తన చదువు పూర్తయితే గాని పెళ్ళివిషయం తలపెట్టనన్నాడు. కాని, సుబ్బారావు యీ మాటనే మరోవిధంగా అర్థంచేసుకున్నాడు. "మీ అమ్మాయి నాకు నచ్చలేదు" అని చెప్పడానికి ఇది డొంకతిరుగుడనుకున్నాడు. సుబ్బారావుచెల్లెలిని శానిటరీ ఇనస్పెక్టరు ఉద్యోగంలోవున్న ఒక ఉబ్బసపురుషునికిచ్చి పెళ్ళి చేశారు.

సుబ్బారావుచెల్లెలికి పెళ్ళయిపోయిందిగాని సుబ్బారావుకుమాత్రం మూర్తి తన బావగారు కాలేదే అనే వ్యథ పోలేదు. మూర్తికి ఎలాగైనా ఒక కోతిని తీసుకొచ్చి అంటగట్టాలని అతను వ్రతంపట్టాడు. మూర్తిమీద పగతీర్చుకోవాలనే పట్టుదల తీవ్రంగా వుందతనికి. అయితే తను పట్టుదల నెగ్గించుకోవాలంటే మూర్తితో స్నేహం చేస్తే ప్రయోజనముంటుందిగాని, వైరంమీద పగ సాధించలేనని సుబ్బారావు తెలుసుకున్నాడు. సుబ్బారావుచెల్లెలి పెళ్ళికి మూర్తివెళ్ళాడు. సుబ్బారావుకు లోపల ఎలాగవున్నా పైకిమాత్రం మూర్తిని చాలా ఆదరించాడు. ఆవేళనుంచీ మూర్తీ, సుబ్బారావుల స్నేహం చాలా గాఢమయిపోయింది. అదే యీనాడు మూర్తిజీవితంలో విషపు నవ్వు నవ్వింది.

తను సుబ్బారావుచెల్లెల్ని పెళ్ళిచేసుకోకపోయినా సుబ్బారావు కించిత్తయినా మనసులో బాధపడకుండా తనను పెళ్ళిలో ఆదరించడమేగాకుండా, యిన్నాళ్ళూ యిలా స్నేహం చెయ్యడం తనలో ఏదో మహత్తరగుణం వుండడంవల్లనేగాని, సుబ్బారావు హృదయంలో ఏదో దురభిప్రాయం వుందని మూర్తి యీనాటివరకూ గమనించలేదు. మూర్తీ సుబ్బారావుల స్నేహం మూలాన్ని మూర్తి నిజంగా సుబ్బారావు చేతిలో కీలుబొమ్మ అయినాడు. కాని తనే సుబ్బారావును లోబరుచుకుంటున్నాననీ, అతనిలో ఏదయినా వైరభావముంటే తన చమత్కారం వల్లనే పోగొడుతున్నాననీ మూర్తి లోలోపల గర్వించకపోలేదు.

మూర్తికి ఇంతకుముందు అనేక మంచి సంబంధాలు వచ్చాయి. ఆ పిల్లలు మంచి అందమయినవాళ్ళు, బాగా చదువుకున్నవాళ్ళు గొప్ప వంశంలోవారు కోరిన కట్నం ఇస్తామని వచ్చారు. వాళ్ళ నాన్నా, అమ్మ ఒప్పుకున్నాగాని, మూర్తి ఆ సంబంధాలన్నిటినీ తోసిపారేశాడంటే అందులో సుబ్బారావు తంత్రాంగం ఏమాత్రమో లేకపోలేదు. ఎంత మంచి సంబంధం వచ్చినా "మూర్తీ, ఇదేం సంబంధంరా, నీకు దీనిని తలదన్నిన సంబంధాలు వస్తాయి. కొన్నాళ్ళు ఓపికపట్టు" అనేవాడు సుబ్బారావు. మూర్తి ఆ మాటను శిరసావహించేవాడు.

ఒకవేళ మూర్తి సుబ్బారావుమాటకు లొంగక ఏ సంబంధానైనా చేసుకుతీరుతానని పట్టుపడితే, ప్రధానం చేసుకుందుకు బయలుదేరివచ్చేవాళ్ళుకూడా కారణంలేకుండా ఆగిపోయేవారు. అందులోగూడా సుబ్బారావుదే కనుకట్టు, హస్తలాఘవం.

మూర్తిప్రాణం విసిగింది. తనుగూడా త్వరలో ఒక సంసారి అవాలి. ఈ సారి పిల్ల ఏమాత్రం బాగున్నా తన ఆదర్శాభిప్రాయాల గోడల్ని ఏమాత్రం రాసుకుపోయే ముఖకవళికలు, అంగసౌష్ఠవం వున్న పిల్ల వచ్చినా పెళ్ళి చేసేసుకుందామనుకున్నాడు. అతనలా అనుకోవడమేమిటి! అతనలా అనుకునేటట్లు చేశాడు సుబ్బారావు. చివరకు "నాకు ఆదర్శాలే లేవు. నేను నిరాదర్శపురుషుణ్ణి. స్త్రీ అనే వ్యక్తి ఎవరు నాకేసి జాలిగా చూసినా నేను పెళ్ళిచేసుకుందుకు సిద్ధంగా వున్నాను." అనేటట్లుగూడా సుబ్బారావు మూర్తిని మార్చగలడు.

పార్వతి సుబ్బారావుకు బావమరది కూతురు. పద్ధెనిమిది ఏళ్ళుంటాయి. ఆ అమ్మాయితండ్రి ఆపిల్లకు పెళ్ళి చేదామని అయిదుసంవత్సరాలుగా దేశమంతా పేనేసి తిరుగుతున్నాడు. పిల్ల బాగుండదని అందరూ పెదిమ విరిచి చక్కాపోతున్నారు. ఎక్కడైనా మంచి సంబంధం చూసిపెట్టమని ఆయన సుబ్బారావును కోరాడు. సుబ్బారావుకు సరైన అదనులో సరియైన సంబంధం దొరికింది, మూర్తికి ముడిపెట్టడానికి.

మూర్తికి పార్వతినిచ్చి పెళ్ళిచేస్తే ఒకవైపున మూర్తి మీద కసితీర్చుకోవచ్చు; మరోవైపున బావమరిదికి గొప్ప సహాయం చేసినవాడవుతాడు. సుబ్బారావు తన మానప్రాణాల్ని అమ్మివేసయినాసరే యీ పెళ్ళి చేసితీరాలనుకున్నాడు. ఏమిటో, పెళ్ళిళ్ళల్లో అసలు వాళ్ళకన్న మధ్యవర్తులెక్కువ బాధపడతారు. వీళ్ళ ఆశలు సిద్ధి చేదాకా నిద్రపోరు, అన్నం ముట్టరు. పది దెబ్బలాటలూ, వంద దొమ్మీలూ అయినాసరే వాళ్ళు అనుకున్నది జరిగితీరాలంటారు. సుబ్బారావు యిప్పుడు రెండు వ్యూహాలతో వున్నాడుగాబట్టి అతని కెక్కువ పంతం వుంటుందంటే ఆశ్చర్యం లేదు.

మూర్తి పార్వతిని చూడ్డానికి వెళ్ళినపుడు సుబ్బారావుమాత్రం మూర్తితో కలిసివున్నా, లోపాయకారీగా ఆడపిల్లతరఫుమనిషే. చీకటిపడే వేళ పెళ్ళిచూపు లయినాయి. ఏదో మసిపూసి మారేడుకాయ చేశారు. ఫలహారాలతోను, మర్యాదలతోను మూర్తికి ఊపిరాడకుండా చేశారు. పార్వతి ఓరగా కూర్చుని వీణమీద దీనంగా, జాలిగొల్పేటట్లు రెండు పాటలు పాడింది. ఎంత అనాకారైనా పార్వతిలో రెండు మంచిలక్షణాలున్నాయి. ఒకటి—మాంచి నిడుపాటి, దట్టమైన, నల్లని జడ. రెండు—చక్కటి, శ్రావ్యమైన గొంతుక. ఈ రెండింటిగురించే సుబ్బారావు ఇదివరకు చాలా పొగిడిచెప్పాడు మూర్తితో. ఇప్పుడు మూర్తి గూడా తన దృష్టిని వాటిమీదే కేంద్రీకరించాడు. ఇక మిగతా విషయాలు ఆలోచించడానికి తావేదీ? మరి మనిషి అసహ్యంగా కనుపించిందా, అందంగా కనుపించిందా అంటే ఆప్రశ్నకు మూర్తికి సమాధానం దొరకడంలేదు. అతను ఆమె అసహ్యంగా వుందనిగాని, అందంగా వుందనిగాని అనే స్థితిలో లేడు. అందంగా వుంది అనడానికి తనకు పరిస్థితులు ఎంత నిరాధారంగా వున్నాయో, అసహ్యంగా వుంది అనడానికీ కూడా అంత నిరాధారంగానే వున్నాయి. మూర్తి ఆ అవస్థలోనే వున్నాడు. మూర్తెవడు? వుండడానికీ, వుండకపోవడానికీను! సుబ్బారావు అతన్నలా వుంచాడు. మూర్తి ఏమన్నా అయిష్టత కనపరిస్తే "ఇల్లు ఇరకటం, ఆలి మర్కటంగా వుంటేనే, జీవితంలో పొదుపూ, హాయీ వుంటా"యని చెప్పడానికి గూడా సుబ్బారావు సిద్ధపడేవున్నాడు.

మూర్తికీ, పార్వతికీ పెళ్ళయిపోయింది. పార్వతి ఎప్పుడూ అనుకోలేదు తాను మూర్తివంటి అందగాణ్ణి పొందుతానని. ఆమె యీ దైవఘటనకు చాలా సంతోషించింది.

నాలుగు వేలరూపాయల కట్నంతో మరి మూర్తి తండ్రి మాట్లాడలేదు. కోడల్ని చూశాకమాత్రం ఏమంటాడు? ఏమనగలడు? "వాడికినచ్చింది. చేసుకున్నాడు. వాడి ప్రారబ్ధం—అనుభవించాలిసిందే బతికివున్నన్నాళ్ళూ" అన్నాడు.

ఇక మూర్తివిషయం ఆలోచిస్తే అతను భార్యను ద్వేషించటమూ లేదు; ప్రేమించడమూ లేదు. ఒకవేళ యీ రెండిటిలో ఏదైనా చేస్తూవుంటే అది అతనికి తెలియకుండానే చేస్తూవుండివుండాలి. మూర్తి ఆశయాలన్నీ ఎప్పుడో గంగలో కలిసిపోయాయి. అయితే అతని జీవితంలోమాత్రం పెద్ద వెలితి ఏర్పడింది. అది అతను గ్రహించాడు. ఈ వెలితికి కారణం తన దౌర్బల్యమూ, లేక సుబ్బారావా ! ఈ సంగతి ఇంకా అతనికి తేలలేదు. బహుశా రెండూనేమో.

సుబ్బారావు ఇప్పటికీ మూర్తికి స్నేహితుడే. అయితే సుబ్బారావుతోమాత్రం మూర్తి ఇదివరకటంత ఉత్సాహంగా లేడు. అతని హృదయంలో కనపడని గాయం ఏర్పడింది. ఆ గాయం ఇప్పుడప్పుడే మానదు. మానే సూచనలు ఏవీ లేవు. బహుశా అతని జీవితాంతం వరకూ వుంటుందేమో. పైగా తన పెళ్ళిగురించి ఇంకా విమర్శించేవాళ్ళూ, సానుభూతి చూపేవాళ్ళూ వాళ్ళమాటలు ఆగాయాన్ని రెచ్చగొడుతున్నాయి. అయితే మూర్తి ఆ బాధంతా కిక్కురుమనకుండా భరించవలసిందే!